క్లుప్తంగా

రేషన్ సకాలంలో పంపిణీ చేయాలి

సీతానగరం: మండలంలోని రేషన్ కార్డులున్న వారందరికీ నిబంధనలకు లోబడి సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ రేషన్ వినియోగదారులకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలూ సరుకులు పంపిణీ చేయాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు, దివ్యాంగులకు ఇళ్లకు సరుకులు చేర్చాలని మార్గ దర్శకాలున్నాయని తెలిపారు. రేషన్ డిపో డీలర్లు నిర్దేశించిన సమయంలో డిపోలు తెరిచి ఉంచాలని సూచించారు. రీ సర్వే పనులు వేగవతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నాలుగేళ్లుగా అమ్మ అన్నప్రసాద వితరణ



జిల్లా ఆసుపత్రి వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో రోగులకు, రోగుల బంధువులైన పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు శ్రీకారం చుట్టిన జిల్లెల్లమూడి అమ్మ సేవా సమితి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి శుక్రవారంతో 1400 రోజులు పూర్తయ్యాయి. విశ్వజనని జిల్లెల్లమూడి అమ్మ దివ్య ఆశీస్సులతో.. గురువు విశాల రామచంద్రరావు ప్రేమానురాగాలతో... జిల్లెల్లమూడి అమ్మ విద్యనభ్యసించి పదవీ విరమణ చేసిన పూర్వ విద్యార్థులైన అమ్మ బిడ్డలు, దాతల సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు గంటేడ సోమేశ్వరరావు, కార్యదర్శి గంటేడ చిన్నంనాయుడు తెలిపారు. గడిచిన నాలుగేళ్లుగా నిర్విఘ్నంగా దీన్ని కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవం

సీతానగరం: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య 42వ వ్యవస్థాపక దినోత్సవం సమాఖ్య అధ్యక్షులు కోనూరు సతీష్ శర్మ సూచనలతో, సమాఖ్య ప్రధాన కార్యాలయం గుంటూరుతో సహ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్ర కార్యాలయాల్లో శనివారం వేడుకలు నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు టివి.శ్రీనివాస్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 42వ వార్షికోత్సవ సమాఖ్య జెండాను ఆవిష్కరించడం, వెబ్‌సైట్‌ను ప్రారంభించడం, సభ్యులకు సమాఖ్య సేవలు మరింత చేరువ చేయడానికి ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని నూతన లక్ష్యాలను సాధించి బ్రాహ్మణ జాతిని, సమాఖ్యను ప్రగతి పథంలో రాష్ట్ర నాయకత్వం నడిపించడానికి అందరూ సహకరించాలన్నారు.

మైనింగ్ తవ్వకాలపై పోరాటం ఆగదు

పార్వతీపురం రూరల్: మండలంలో బడిదేవర కొండపై జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై తమ పోరాటం ఆగదని కొనసాగుతుందని కొండ పరిరక్షణ కమిటీ నాయకులు పి.రంజిత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశంలో కార్యాచరణపై అన్ని విషయాలు చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. ప్రభుత్వం, అధికారులు మైనింగ్ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తవ్వకాలు ఆపి తక్షణమే అనుమతులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కమిటీ సభ్యులు పి.సంగం తదితరులున్నారు.

పైనాపిల్‌కు మద్దతు ధర కల్పించాలి

- మాజీ ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ప్రస్తుత సీజన్‌లో ఏజెన్సీలో పండే పైనాపిల్ పండ్లకు మద్దతు ధర కల్పించాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో టన్నుల కొద్దీ పైనాపిల్ పంట రైతుల చేతికి వస్తున్నప్పటికీ సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నారన్నారు. ప్రారంభంలో ఉన్న పైనాపిల్ ఒక్కొక్కటీ రూ. 15కు కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం ఐదు రూపాయలకు కూడా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ ద్వారా రైతుల నుంచి పైనాపిల్ కొనుగోలు చేసి వెలుగు, ఉద్యానవన శాఖాధికారుల ఆధ్వర్యంలో విక్రయించడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరిందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం!

- పునః ప్రారంభం సమీపిస్తున్నా.. కానరాని మౌలిక సదుపాయాలు
- పలుచోట్ల భవనాల్లేక ఒకే గదిలో నాలుగు తరగతుల నిర్వహణ
- కూటమి ప్రభుత్వంలో కానరాని పనులు, నిధులు

పార్వతీపురం రూరల్:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండో ఏడాదిలోకి అడుగు పెట్టింది. మొదటి విద్యా సంవత్సరం పూర్తయింది. రెండో ఏడాది సమీపిస్తున్నా ప్రభుత్వ విద్యా సంస్థలకు అవసరమైన నిర్మాణాల పట్లగాని, వసతుల విషయమైగాని కనీసం పట్టించుకోవడం లేదు. తద్వారా ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు నాడు - నేడు పథకంతో నూతన భవనాల నిర్మాణాలతో పాటు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్ది 11 రకాల మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించింది. నాడు – నేడు రెండో విడతలో పార్వతీపురం మన్యం జిల్లాలో 545 ప్రభుత్వ విద్యా సంస్థలకు రూ.144.5 కోట్లతో పనులు చేపట్టేందుకు కార్యాచరణ చేసి జగనన్న ప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభించగా కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోవడం మానేసింది. దీంతో అక్కడక్కడ అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు నిలిచిపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కనీస సదుపాయాల కల్పనకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. భవన నిర్మాణాలు పలుచోట్ల పూర్తికాక ఒకే తరగతి గదిలో ఐదు తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.



అసంపూర్తిగా నిలిచిపోయిన ఎమ్మార్‌నగరం జిల్లా పరిషత్ పాఠశాలకు సంబంధించిన రెండస్తుల భవనం



డి.ములగలో ప్రాథమిక పాఠశాల దుస్థితి

ప్రభుత్వ కార్యాచరణే లోపం..

కళ్లకు కట్టినట్టుగా ప్రభుత్వ విద్యాలయాల్లో అనేక సమస్యలు దర్శనమిస్తున్నా ఎప్పటికప్పుడు సమస్యలపై విద్యార్థి సంఘాలు సైతం నిరసనల ద్వారా ప్రభుత్వానికి పాఠశాలల సమస్యలు తెలియజేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. ప్రహరీలు లేక, మరుగుదొడ్లు లేక, తరగతి గదులు చాలక నేటి ప్రభుత్వంలో విద్యార్థులు అవస్థలు పడుతున్నా కూటమి పాలకులు పట్టించుకోవడం లేదు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యాలయాలను తయారు చేసి వాటి ద్వారా నాణ్యమైన వసతులతో కూడిన విద్యను అందించేందుకు చేసిన సంస్కరణలు దేశంలోనే మంచి గుర్తింపు తెచ్చాయి. ఇంగ్లిష్ మీడియం బోధన వంటి ఆలోచనలతో విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో గత ప్రభుత్వం సఫలమైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యాలయాల వైపు చూసే ఆలోచన చేయడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ కారణంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనేందుకు మొగ్గు చూపడం లేదు.

ప్రతిపాదనలు ఉన్నాయి.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు కావల్సిన సదుపాయాలు, నిర్మాణాలపై ప్రతిపాదనలు ఉన్నాయి. వాటిని సంబంధించిన పై అధికారులకు పంపించాం. ప్రతీ పాఠశాలకు నిర్వహణ నిమిత్తం నిధులు మంజూరు అయ్యాయి. కానీ వాటి నిర్వహణకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడ లేదు. మా దృష్టికి ఏవైనా సమస్యలు వస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నాం.

– ఆర్.తేజేశ్వరరావు, జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ, పార్వతీపురం మన్యం జిల్లా

విద్యా వ్యవస్థ గాడి తప్పింది



కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆసరాగా ఉండే అమ్మ ఒడి వంటి పథకాన్ని తల్లికి వందనం పేరిట ఇస్తామని మాట ఇచ్చి ఏ ఒక్క తల్లి ఖాతాల్లోను జమచేసే పరిస్థితి లేకుండా పోయింది. ఇటీవల పదో తరగతి మూల్యాంకనంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా తేటతెల్లమైంది. విద్యా వ్యవస్థపై కూటమి ప్రభుత్వం బాధ్యతా రహితంగా వ్యవహరిస్తుంది. అనేక ప్రభుత్వ విద్యా సంస్థలు అసౌకర్యాలతో రాజ్యమేలుతున్నాయి.

–బి.రవికుమార్, ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి



కవిటి భద్రలో అధ్వానంగా ఉన్న పాఠశాల మరుగుదొడ్లు

తూతూ మంత్రంగా తోటపల్లి కాలువ పనులు



తూతూ మంత్రంగా జేసీబీతో జరిగిన కాలువ పనులు



అభివృద్ధి చేయాల్సిన తోటపల్లి కాలువ గట్టు

సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నది నుంచి పైనున్న ఎక్విడెక్ట్ నుంచి జోగింపేట వరకు ఉన్న తోటపల్లి కాలువ పనులు నిర్వాహకుల జేబులు నింపడానికి తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. కాలువలో నీరు లేకపోవడంతో అభివృద్ధి పనులు ఏటా ఓఎండీఎం నిధులతో ఏటా చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం వేసవి ఆరంభం నుంచి జేసీబీ యంత్రంతో సువర్ణముఖీ నదికి 200 మీటర్ల దూరంలో వేస్ట్ వాటర్ మళ్లింపు, గేట్ వాల్వ్ నుంచి అజ్జాడ బీటీ రోడ్డు బ్రిడ్జి మీదుగా జోగింపేట(కుడి కాలువ 12వ కిలోమీటరు) వరకు జేసీబీతో కాలువలో పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టారు. ఒక వైపు పనులు జరుగుతుండగా మరో వైపు మొక్కలు పుట్టుకొస్తున్నాయంటే పనుల్లో నాణ్యత ఏపాటిదో ఇట్టే అర్థమవుతుంది. వర్షాకాలంలో కాలువ ద్వారా నీరు విడుదల చేసే సమయంలో నీటి ఉధృతిని తట్టుకోలేక గండి పడుతుండడం సాధారణమైన నేపథ్యంలో గట్టు అభివృద్ధి పర్చాల్సిన అవసరం ఉంది. లేనప్పుడు ఈ పనులు కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే జరుగుతున్నట్టు భావించాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

సీతానగరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని ఎంపీడీవో ఎంఎల్ఎస్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ, సిబ్బంది శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. వాతావరణ సమతుల్యత, కాలుష్య నివారణ మొక్కలతోనే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. రైతులు పొలం గట్లు, పోడు భూముల్లో ఫలసాయం ఇచ్చే మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రవణమ్మ, డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ, ఉపాధి ఏపీవో బాలకృష్ణ, మండల పరిషత్ ఏవో వెంకటరావు, సిబ్బంది రామినాయుడు, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఊరించి మందగించిన నైరుతి

- పెరిగిన ఉష్ణోగ్రతలు, వేడిగాలులు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

పార్వతీపురం: గతానికి భిన్నంగా ఈ ఏడాది పది రోజుల ముందే నైరుతి రుతుపవనాలు వచ్చాయని వాతావరణ శాఖ ప్రకటనలు నేపథ్యంలో ప్రజలలో వచ్చిన ఆనందం, ఆహ్లాదం, సంతోషం రెండు రోజులకే ఆవిరయ్యాయి. గత మూడు రోజుల వరకు జిల్లాలో అడపదడపా వర్షాలు కురవగా ప్రస్తుతం వాతావరణంలో మళ్ళీ మార్పులొచ్చి ఎండలు తీవ్రమయ్యాయి. ఈ ఏడాది రోహిణి కార్తె ప్రభావం ఉండదని భావించిన వాతావరణ నిపుణుల అంచనాలు దాదాపు తలకిందులయ్యాయి. రోహిణి కార్తెలో వేడిగాలులు రావడంతో మళ్లీ వేసవి వచ్చిందని ప్రజలలో చర్చ మొదలైంది. నైరుతి రుతుపవనాలు ముందుగా రావడం, బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాలలో విస్తారంగా వర్షాలు కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది. అయితే ఆ ఆనందం ఎక్కువ రోజులు ఉండకుండానే వేసవిని తలపించేలా మళ్లీ 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు మన్యంలో నమోదు అవుతున్నాయి. గతంలో మే నెలలో సగటు వర్షపాతం 60 మిల్లీలీటర్ల లోపు నమోదు కాగా ఈ ఏడాది మే నెలలో 220 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదైంది. మే నెలలో ఇంత ఎక్కువ వర్షపాతం నమోదు కావడం దాదాపు ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు. మే నెలలో వర్షాలు కురిసినప్పటికీ నేలలో సంతృప్తికరమైన తేమ ఉంటేనే విత్తనాలు చల్లే అవకాశం వుందని రైతులు చెబుతున్నారు. దీంతో పంటల సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఇదిలా వుండగా రైతు సేవా కేంద్రాలలో సరఫరా చేసిన పచ్చిరొట్ట విత్తనాలు పిల్లి పెసర, కట్టె జనుము విత్తనాలను భూసారం పెంచేందుకు ప్రస్తుతం పంట పొలాలలో వేస్తున్నారు.

అధ్వానంగా అంటివలస రహదారి



సాలూరు మండలంలోని పెదపంద నుంచి అంటివలస మీదుగా మామిడిపల్లి రోడ్డు వరకు ఉన్న రహదారి పూర్తిగా గోతులతో ప్రమాదకరంగా తయారైంది. ఈ రహదారి మీదుగా వందల సంఖ్యలో గిరిజనులు రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. వాహన చోదకులు ఈ మార్గంలో ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. చిన్నపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరి ప్రమాదాలకు హేతువుగా మారింది. ఇప్పటికైనా ఈ రహదారి బాగుకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

– సాలూరు రూరల్

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణ ప్రాంగణంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

సీతానగరం: ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు యోగాతోనే మటుమాయం అవుతాయని ఎంపీడీవో ఎల్ఎస్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని హోలీ క్రాస్ విద్యాలయంలో వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందుతున్న సీసీలు, వీవోఏలు, ఏక్టివిస్ట్‌లు వెలుగు సిబ్బంది గ్రామాల్లో ఆరోగ్య పరమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి యోగా ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యం అలవర్చుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఏపీఎం శ్రీరాములు మాట్లాడుతూ ఇక్కడి శిక్షణ పొందిన వారంతా గ్రామాల్లో ఏక్టివిస్ట్‌లకు శిక్షణ ఇవ్వడం తద్వారా పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది గుర్తించిన వారికి యోగాభ్యసన చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ, ఎంఈవో జి.సూరిదేముడు, వెలుగు సీసీలు, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి : రాజన్నదొర

సాలూరు: ప్రజలకు వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. పట్టణంలో నూతనంగా అత్యాధునిక వసతులతో నిర్మించిన నీహాల్ మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిగా పాల్గొన్నారు. ఆసుపత్రుల్లో గదులను ప్రారంభించారు. అంతకు ముందు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆసుపత్రిని ప్రారంభించారు.



నీహాల్ మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి గదులను ప్రారంభిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



పుష్పశ్రీవాణి దంపతులను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న గోపాల్ తదితరులు

జియ్యమ్మవలస రూరల్: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సూచించారు. పార్టీ రాష్ట్ర యూత్ వింగ్ సెక్రటరీగా రెండోసారి నియమితుడైన గుమ్మలక్ష్మీపురానికి చెందిన నిమ్మక గోపాల్..ఎంపీపీ దీనమయ్య ఆధ్వర్యంలో చినమేరంగిలో పుష్పశ్రీవాణి దంపతులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి కట్టబెట్టినందుకు ఆనందంగా ఉందని, తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిందుకు కృతజ్ఞతలని గోపాల్ తెలిపారు.

అనంతరం వారు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్, సర్పంచ్ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ప్రారంభించిన కలెక్టరు

కొమరాడ: మండలంలోని చినఖేర్జిల పంచాయతీ, బంజకుప్ప గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన వీధి లైట్లను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనకల్యాణ సంస్థ ఆధ్వర్యంలో సిగ్నఫై ఇన్నోవేషన్ ఇండియా సహకారంతో నాలుగు మండలాల్లోని దాదాపు 230 గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయడం అనేది అభినందనీయమన్నారు. ఆ కంపెనీ తన సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా ఈ సదుపాయం కల్పించినట్లు కలెక్టరు పేర్కొన్నారు. అనంతరం గ్రామ ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

కొమరాడ: మత్స్య సంపద పెంచాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. మండలంలోని కోటిపాం గ్రామంలో చేపల పెంపకానికి సిద్ధం చేసిన చెరువును ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడ చేపట్టే చేపపిల్లల పెంపకాన్ని ఆదాయ వనరుగా మార్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోండిలా..

- విద్యార్థులూ సమాయత్తంకండి
- ముందస్తు సేకరణతో ధ్రువపత్రాలు పొందండి
- సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం

బలిజిపేట: టెన్త్, ఇంటర్ తదితర పరీక్షల ఫలితాలు కొద్ది రోజుల కిందట వెలువడ్డాయి. పై తరగతుల్లో ప్రవేశాలకు వివిధ కోర్సుల్లో చేరేందుకు పలు ధ్రువపత్రాలు తప్పనిసరి. అందువల్ల విద్యార్థులు ముందస్తుగా వారికి కావలసిన ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవడం ఎంతో అవసరమని ఉపాధ్యాయులు, అధ్యాపకులు సూచిస్తున్నారు.

సచివాలయాల ద్వారా..

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకు వచ్చిన సచివాలయ వ్యవస్థతో అన్ని రకాల ధ్రువపత్రాలు సులువుగా పొందే అవకాశం లభించింది. సచివాలయాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉన్నాయి. అందువల్ల విద్యార్థులు తమ సమీప సచివాలయానికి వెళ్లి కావలసిన ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోగా అధికారులు ధ్రువపత్రాలు మంజూరు చేస్తారు. ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ప్రధానంగా కుల, ఈడబ్ల్యూస్, ఓబీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పై కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే వారు ముందుగానే ఈ ధ్రువపత్రాలు సమర్పించి ఉంటారు. అయితే నేరుగా అడ్మిషన్ పొందే ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో చేరేవారు అవసరమయ్యే ధ్రువ పత్రాలను ముందుగానే పొంది వుంటే ఆందోళన చెందకుండా పై కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు వీలవుతుంది.

ధ్రువపత్రాలు పొందాలంటే..

- ఒకటో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులకు ప్రధానంగా కుల, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, ఆదాయం వంటి ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటికోసం సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- పై వాటిని పొందాలంటే ఆధార్, రేషన్‌కార్డు, విద్యార్హతకు సంబంధించిన అర్జీ పూర్తి చేసి అవసరమైన నకలును సచివాలయం డిజిటల్ సహాయకుడికి అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో పొందుపరచిన వివరాలపై వీఆర్‌వో క్షేత్ర స్థాయిలో విచారించి, అందుకు సంబంధించిన వివరాలపై నివేదికను ఆర్ఐకి సమర్పిస్తారు.
- ఆర్ఐ పరిశీలించి అన్ని సరిగా ఉంటే తహసీల్దార్ వద్దకు పంపిస్తారు. అప్పుడు తహసీల్దార్ తన లాగిన్‌లో పరిశీలించి డిజిటల్ సంతకంతో ధ్రువపత్రాన్ని మంజూరు చేస్తారు. దరఖాస్తుదారుడి మొబైల్‌కు వచ్చే మెసేజ్‌తో సచివాలయంలోగాని, మీ సేవా కేంద్రంలోగాని ధ్రువపత్రాలను పొందవచ్చు.



ధ్రువీకరణ పత్రాలు

ఒత్తిడి పెరగక ముందే

సాధారణంగా జూన్ నెలల్లో ముఖ్యంగా సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ధ్రువపత్రాల జారీకి సంబంధించి సిబ్బందికి అధిక ఒత్తిడి ఉంటుంది. వీటి కోసం దరఖాస్తు చేసుకున్న తరువాత వీఆర్‌వో, ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలన, విచారణ చేయాల్సి ఉంటుంది. అందువల్ల దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వస్తే ధ్రువపత్రాల జారీ కూడా ఆలస్యమవుతుంది. ముందుగానే ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవడం మంచిది.

జీసీసీ టెండర్లు ఖరారు



ఐటీడీఏ పీఓ సమక్షంలో టెండర్లు నిర్వహిస్తున్న జీసీసీ అధికారులు

సీతంపేట: గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకుల టెండర్లు ఖరారయ్యాయి. ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సమక్షంలో టెండర్లు జరిగాయి. జూన్ నుంచి ఆగస్టు వరకు సరఫరా చేయాల్సిన 31 రకాల సరుకులకు సంబంధించి శుక్రవారం టెండర్లు నిర్వహించగా.. 8 మంది ట్రేడర్లు హాజరయ్యారు. ఏపీఓ చిన్నబాబు, జీసీసీ డీఎం సంధ్యారాణి, మేనేజర్లు డి.కృష్ణ, జి.నరసింహులు, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, హెచ్‌డబ్ల్యూఓలు పి.అమల, హెచ్.శారద, వెంకటినాయుడు, రాజారావు, పాల్గొన్నారు.